# సామ్మొకడిది.....

'మేడమ్! ప్లంబర్ కావాలన్నారు కదా, ఇదిగో తీసుకొచ్చాను' అన్నాడు వాచ్‌మెన్ ఉదయం పదిగంటల వేళ పేపరు తిరగేస్తుంటే.

పేపరులోంచి తలెత్తి చూశా.

'ఏడి ఎక్కడ' అన్నాను ఎవరూ కనపడక.

'ఈ అమ్మాయేనండి - ప్లంబింగ్ పనులు చేస్తుంది' అన్నాడు వాచ్‌మెన్ నాయుడు.

ఎదురుగా ఇరవై పాతికేళ్ల మధ్య వున్న చామనచాయ రంగులో, చుడీదార్ - కుర్తా వేసుకుని, జుట్టుకి రబ్బరు బ్యాండ్ కట్టుకుని - పెద్ద కళ్లతో కళగా వున్న ఓ అమ్మాయి నిలబడి వుంది. భుజాన టూల్ కిట్ లాంటి బ్యాగుంది.

ఆశ్చర్యంగా చూశా - 'ఈ అమ్మాయా, ప్లంబరా....!

'అవును మేడమ్, ప్లంబిగ్ పని ఆడవాళ్లు చేయకూడదా...' చనువుగా నవ్వుతూ అడిగింది.

అప్పటికి కాస్త తేరుకుని -

'ఏమొ, మొదటిసారి చూస్తున్నాను కదా ఆడపిల్ల ప్లంబింగ్ పని చేయడం... అందుకు ఆశ్చర్యం అనిపించింది. ఇంతకీ నీకు ఈ పనులన్నీ వచ్చా. ఎక్కడ నేర్చుకున్నావ్. మీ నాన్న ప్లంబరా...' కుతూహలంగా అడిగా.

'లేదండీ, నేను ఐ.టి.ఐ. లో రెండేళ్ల కోర్సు చేశానండీ'

ఈసారి మరింత ఆశ్చర్యం అనిపించింది.

'కోర్సు చేశావా, ఎక్కడ? టెన్త్ తరువాతా?

'కాకినాడ పాలిటెక్నిక్‌లో పదో క్లాసు తర్వాత రెండేళ్ల కోర్సండి. ట్రైనింగు అది అయ్యాక ఇప్పుడిప్పుడే చిన్న చిన్న పనులు చేస్తున్నానండీ' అంది ఆ అమ్మాయి.

మొహంలో తెలివితేటలు, తనమీద తనకు నమ్మకం కనిపించాయి ఆమొహంలో. అప్పటివరకు నిలబెట్టి మాట్లాడుతున్న నేను-

'అలా కూర్చో...' అన్నాను గౌరవమిస్తూ.

'అదేమిటి నీవీ కోర్సు ఎందుకు చేశావ్. మోటు పని కదా. సాధారణంగా ఆడవాళ్లెవరూ ఈ పనులు చేయరు కదా! వాల్వులు బిగించడాలు, పైపులైన్లు పనులు ఇవన్నీ నీవల్ల అవుతాయా. అసలీ కోర్సు ఎందుకు చేయాలనిపించింది. మీ ఇంట్లో మగవాళ్లెవరూ లేరా, నీ ఇంటికి నీవే ఆధారమా?' అని అమ్మాయి గురించి తెలుసుకోవాలన్న కుతూహలంతో ప్రశ్నలు గుప్పించాను.

'ఇంతకీ నీ పేరు చెప్పు ముందు' అన్నాను.

'నా పేరు కవిత అండి. ఇంట్లో మా నాన్న, అమ్మ, అన్నయ్య వుంటారండీ, నేను ముందు ఎలక్ట్రీషియన్ కోర్సు చెయ్యాలనుకుంటే సీటు దొరకలేదండి. ప్లంబింగ్ ఎందుకు చేయకూడదనిపించింది. మానాన్న వాళ్లు వద్దన్నా పంతం వచ్చింది. ఏం అన్ని పనులు ఈ రోజుల్లో ఆడవాళ్లు చేస్తుండగా ఇది మాత్రం ఎందుకు చేయకూడదని చేరానండీ. మా నాన్న ఇన్‌కంటాక్స్ ఆఫీసులో ప్యూన్ అండి. అసలు ఇంజనీరింగ్ చెప్పిస్తా, ఎంసెట్ రాయమన్నాడండి. నాకు లెక్కలంటే భయం. పాలిటెక్నిక్‌లో చేరతానన్నాను. మొదట్లో నట్లు, బోల్టులు, వాల్వ్‌లు బిగిస్తుంటే, స్పానర్లు పట్టుకుంటే చేతులు కందిపోయి, తొక్క రేగిపోయి మంట పుట్టేది. ఇప్పుడు చేతులకు అలవాటయిపోయింది లెండి, మొద్దుబారింది చర్మం' అని నవ్వింది. 'మేడమ్, మీ బిల్డింగ్‌లో ప్లంబర్ లేడంట గదా - నేను రోజూ మీరే టైముకి రమ్మంటే ఆ టైముకి వచ్చి ఓ గంట, రెండు గంటలు డ్యూటీ చేసి మీ కంప్లయింట్స్ అటెండయివెడతాను. మీరు చెపితే వింటారు మేనేజ్‌మెంటు అన్నాడు వాచ్‌మెన్. ఈ పని ఇప్పించండి నాకు' అంది.

'ఆ పక్క వీధిలో పల్లవి అపార్ట్‌మెంట్స్ లో మెయిన్‌టెనెన్స్ నాకప్పగించారు. కావలిస్తే వాళ్ళ దగ్గిర కాయితం తెస్తా' అంది.

'ఆ సెక్రటరీ నాకు తెలుసులే, నే మాట్లాడుతాలే. ముందు పైకెళ్లి రెండు మూడు వాల్వ్స్ పోయాయిట. వాచ్‌మెన్ చూపిస్తాడు. చూసి బాగవుతాయో, మార్చాలో చూసి ఆపని చేసిరా' అన్నాను.

'నేను మా సెక్రటరీతో మాట్లాడి నెలవారీ డ్యూటీ సంగతి చెబుతాను.'

వాచ్‌మెన్‌తో – 'ఈ అమ్మాయికి ఏం చెయ్యాలో చూపించు – ' అన్నాను.

ఓ గంటన్నర తరువాత ఒకటి కొత్త వాల్వు మార్చి రెండు రిపేరు చేసి వచ్చింది.

'చూడమ్మాయ్! మా బిల్డింగ్‌లో అరవై ఇళ్లున్నాయి. మాకు కాస్త నీళ్ల ప్రోబ్లం వుంది. నాలుగు, ఐదు అంతస్తులకి నీరు సరిగా రాదు. దాంతో గొడవలు వస్తున్నాయి. ఇప్పుడు మేం ప్రతి అంతస్తుకి ప్రతి ఇంటికి వేరే కనెక్షన్ ఇచ్చి నీళ్లు అందరికి సరిగా ప్రెషర్ వచ్చేట్టు మార్చాలని ప్లానులో వున్నాం. ఈ పని కాంట్రాక్టు ఇవ్వాలనుకుంటున్నాం. ఇంత పెద్ద పని నీవు చెయ్యగలవా. ఇలాంటివి కాంట్రాక్టు పనులు చెయ్యగలవా.'

ఆ అమ్మాయి మొహం వికసించింది.

'ఎందుకు చెయ్యలేనండి. అన్నీ వచ్చండి. పైపులైన్లు మార్చడం, అవన్నీ మాకు నేర్పుతారండి.'

'మరి ఒక్కర్తివి...'

'నేను హెల్పర్‌ని పెట్టుకుంటానండి. అసలు మా అన్నయ్యని నాతో తీసికెళ్లి వాల్వులు, నట్టులు, బోల్టులు, థ్రెడ్డింగ్ పనులు వాడిచేత చెయిస్తూ పని నేర్పుతున్నానండి. నేను తప్పకుండా చేస్తాను మేడమ్! ఒకసారి అవకాశం ఇచ్చి చూడండి, మీలాంటివారు ఇస్తే ఇకముందు ఇంకా కొందరు ఈ కాంట్రాక్టు పనులిస్తారు.

'అయితే ఒకసారి డాబా మీదకి వెళ్లి లైన్లు అవి చూడు. ఎలా చెయ్యాలో వాచ్‌మెన్ చూపిస్తాడు. ఐదంతస్తులకి వచ్చే లైను నుంచి విడివిడిగా అందరికీ కనెక్షన్లు ఇవ్వాలి. అదంతా మెటీరియల్, కూలి అవీ ఎంత అవుతాయో సుమారుగా చెప్పాలి. ఐదో అంతస్తు వరకు గనక ఝూలా అది వేసుకోవాలేమో, ఏం చేస్తావో, ఎలా చేస్తావో, ఎందరిని పెట్టుకుంటావో మాకు మొత్తం కాంట్రాక్టు పని కావాలి. ఎస్టిమేట్ ఇవ్వాలి, ఇదంతా నీవల్ల అవుతుందా.'

'ముందు నేను చూసి, మెజర్‌మెంట్స్ తీసుకుని ఇంటికెళ్లి ఎస్టిమేట్ రాసి పట్టుకొస్తాను. విత్ మెటీరియల్, వితౌట్ మెటీరియల్ అన్ని వివరాలు రాసిస్తాను. నాకు రేపొక రోజు టైమివ్వండి' అంది ఆరాటంగా. అప్పుడే ఆ పని చేసేయాలన్న ఉత్సాహం కనిపిస్తుందా అమ్మాయిలో.

'సరే, ఈలోగా నేను మావాళ్లతో మాట్లాడతాను. నెల జీతానికి పెట్టుకునే విషయం సెక్రటరీతో చెపుతాను. ఇప్పుడెవరూ ఇంట్లో లేరు. రేపు నీవు వచ్చాక చెబుతాను. ఈ పనికి కూడా రేపు డబ్బిప్పిస్తా. అవునూ, నీ కోర్సులో మెజర్‌మెంట్స్ తీయడం, ఎస్టిమేషన్ ఇవ్వడం లాంటివి కూడా నేర్పుతారా. ఆహా, ఈ కోర్సు గురించి తెలుసుకోవాలని అడుగుతున్న - తెలిస్తే ఎవరికన్నా చెప్పొచ్చు కదా అని' అడిగాను.

'థియరీలో కొలతలు, లెక్కలు, ఎస్టిమేషన్ వేయడం లాటివన్నీ నేర్పుతారండీ. ప్రాక్టికల్స్‌లో అన్నీ స్వయంగా చేయిస్తారండీ. థ్రెడ్డింగ్, డ్రిల్లింగ్, పైప్ కటింగ్, వాల్వులు వగైరా బిగించడం... అన్నీ నేర్పిస్తారండి.'

'బాగానే వుంది. ఆడపిల్లవైనా నీ కాళ్లమీద నీవు నిలబడాలన్న నీ ఆలోచన నాకు నచ్చింది. కష్టమైన కోర్సు చేసి నీలాంటి అమ్మాయిలకి దారి చూపుతున్నావు' అన్నాను.

'మొదట్లో మా ఇంట్లో వద్దన్నా బలవంతంగా నేనే చేశానండి. ఎలక్ట్రీషియన్ తరువాత ప్లంబింగ్‌కి గిరాకీ బాగా వుందండి. ఇన్ని ఫ్లాట్లు కడుతున్నారు కదా, మంచి అవకాశాలు దొరుకుతాయని ఆశఅండి. ప్రతి బిల్డింగ్‌కి ఓ ప్లంబరుని పార్ట్‌టైమ్‌కైనా పెట్టుకుంటారు గదా, రెండు మూడు బిల్డింగుల మెయిన్‌టెనెన్స్ చేస్తూ మధ్య మధ్య ఇలాంటి కాంట్రాక్టులు వస్తే కొద్దిరోజులలోనే నిలదొక్కుకుంటానండి. మీరీ కాంట్రాక్టు పని ఎవరితోనూ మాట్లాడకండి మేడమ్. దయచేసి నాకే ఇప్పించండి. ఇదొక్కటి చేస్తే నాకు ఎక్స్‌పీరియన్స్ వచ్చి కాన్ఫిడెన్స్ వస్తుంది'- ప్రాధేయపూర్వకంగా అంది.

'సరేలే, కానీ ఇది నా స్వంత ఇంటి పని కాదు కదా. మేనేజ్‌మెంట్ ఒప్పుకోవాలి. నీ కొటేషన్ మాకు నచ్చాలి. మేమూ ఇద్దరు ముగ్గురిని అడిగి కదా, 'ఎవరికివ్వాలి అని నిర్ణయించుకోవాలి... సరే వెళ్లు.. రేపు పది లోపల రా - సెక్రటరీని కలుద్దువుగాని' అని చెప్పి పంపాను.

మా బిల్డింగులో ముందునించి యాక్టివ్ మెంబర్‌ని. ఒకసారి ప్రెసిడెంటు, రెండుసార్లు ట్రెజరరుగా వుండి, అన్నింట్లో సలహాలు ఇస్తూ, బిల్డింగు మీద శ్రద్ధ తీసుకునే నలుగురయిదుగురిలో నేనూ ఒకరిని అవడం వల్ల మేనేజ్‌మెంట్ మారినా నా మాటకి కాస్త విలువవుంది. మగాళ్లు సెక్రటరీ వగైరాలు ఇళ్లలో రోజంతా వుండరు గనక ఎవరైనా ఏదన్నా మాట్లాడాలని వస్తే నాదగ్గరకి తీసుకొస్తారు. కవిత విషయం ప్రెసిడెంటు, సెక్రటరీతో చర్చించా. మెయిన్‌టెనెన్స్‌కి ఫరవాలేదు కానీ లైన్లు

మార్చే పని ఆడపిల్ల ఏం చేయగలదు' అన్నారు. 'చాలా నమ్మకంగా చేసి చూపిస్తానంటోంది గదా, ఆడామగా తేడా ఏముంది. మనకి పని కావాలిగాని... అయినా చూద్దాం ఎస్టిమేషన్ అది ఎలా చేస్తుందో చూసి ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగులో చెప్పి నిర్ణయిద్దాం' అని ఒప్పించాను.

కవితని నెలకి ఆరు వందలకి బిల్డింగు ప్లంబర్‌గా పార్ట్‌టైం రోజుకి ఉదయం ఓ గంట రెండు గంటలు వుండి కంప్లయింట్స్ అటెండయి వెళ్లేట్టు పెట్టకున్నాం - కవిత రెండు రోజులు డాబా మీదకి వెళ్లి లైన్లు ఎలా మార్చాలో చూసుకుని లెక్కలు రాసుకుంది. ఆ అమ్మాయి ఎంత చక్కగా ప్లాన్ గీసి రెండు రకాల ఎస్టిమేషన్ విత్ మెటీరియల్, వితౌట్ మెటీరియల్ అంటూ చక్కగా విడివిడిగా కావలసిన సామానులు, కూలి, వగైరా రాసిన పద్ధతిలో మంచి ప్రొఫెషనలిజమ్ కన్పించింది. పని కూడా అంత చక్కగా చేయగలదు అన్న నమ్మకం కలిగించింది. ఎగ్జిక్యూటివ్ బాడీ మీటింగ్ అయి కవితకి కాంట్రాక్టు అప్పగించాం.

అనుకున్న దానికన్నా పది రోజుల ముందే ఇరవై రోజులలో పని చక్కగా పూర్తిచేసింది. ఒక్కో అంతస్తుకి వెళ్లే మెయిన్ లైనులోంచి అందరి ఇళ్లకి విడివిడిగా కనక్షను ఇచ్చి నీళ్ల ప్రెషర్ అన్ని అంతస్తులకి ఒకేలా వచ్చేట్టు చేయడంతో మాకు గొడవలు తగ్గి అంతా సంతోషించారు. నీట్‌గా చేసిన పనిని అంతా మెచ్చారు. ఒక హెల్పరుని, అన్నని పెట్టకుని థ్రెడ్డింగ్‌ల దగ్గరి నుంచి అన్నీ స్వయంగా చేయించింది.

'ఈ కాంట్రాక్టులో నీకెంత మిగిలింది కవితా' అన్నాను పనంతా ముగిసి పేమెంటు అయ్యాక, కుతూహలంగా అడుగుతున్నా అంతే' అన్నాను.

'ఎక్కువ లేదండి మేడమ్, మొదటిసారి కదా. నా పని మీకు నచ్చాలి, నచ్చి మీరు ఇద్దరు ముగ్గురికి రికమెండ్ చెయ్యాలి. మొదటిసారి లాభం కంటే మంచి వర్కరు అన్న పేరు రావాలి మేడమ్. ఐదువేల దాకా మిగిలింది. అందులో మా అన్నయ్యకి ఓ పదిహేను వందలు ఇచ్చాను' అంది.

కవిత తెలివైన ఆలోచన, ముందుచూపుకి మెచ్చుకోలుగా చూశాను.

'మీ అన్నయ్య ఏం చదువుకోలేదా. ఆడపిల్లవి నీవు చదివి ఉద్యోగం చేస్తున్నావు..'

'వాడికి చదువు మీద ధ్యాస లేదండి. ఏడో క్లాసు తప్పి అల్లరి చిల్లరగా తిరుగుతుంటే నేను వాడికి డబ్బు ఆశ చూపి నాకింద హెల్పర్‌గా పెట్టుకున్నాను.'

'మేడమ్.. ఈ వీధిలో ఇంకో కొత్త అపార్టుమెంట్స్ కడుతున్నారు. దానికి ప్లంబింగ్ పనులకి కాంట్రాక్టు ఇమ్మని అడిగాను. మీ అపార్ట్‌మెంట్స్ కాంట్రాక్టు చేశాననీ, కావలిస్తే అడగమని మీ పేరు చెప్పాను. ఎవరన్నా అడిగితే కాస్త రికమెండ్....'

'దాందేం వుందిలే అడిగితే చెప్తాను' అన్నాను.

ఆర్నెల్లు తిరిగేసరికి కవిత పనిలో నిలదొక్కుకుంది. నాలుగు అపార్‌మెంట్స్ మెయిన్‌టెనెన్స్ ఒప్పుకుంది. రెండు వేలు సంపాదించుకుంటోంది నికరంగా. మధ్య మధ్య కాంట్రాక్టు పనులు, ప్రైవేటు పనులు చేసుకుని బాగానే అర్జిస్తోంది. ఆ అమ్మాయిని చూసి మా బిల్డింగ్‌లో పనివాళ్లందరికి 'చూడండి, ఆడపిల్లయినా ఎలా చేస్తుందో.. మీ పిల్లలకి పన్నెండేళ్లొచ్చేసరికి కొంప మునిగినట్లు పెళ్లి చేసేసి పంపిస్తున్నారు, చదివించండి కనీసం మెట్రిక్ వరకు' అంటూ చెప్పేదాన్ని.

ఈ అమ్మకిదో చాదస్తం అనుకుంటూ ముసిముసి నవ్వులు నవ్వేవారు. నాకు తెలుసు వీళ్లని మార్చడం నాతరం కాదని - అయినా పదిసార్లు చెపితే కాస్తయినా బుర్రకెక్కి వాళ్ల బతుకులు బాగుపడతాయని నా ఆశ.

చూస్తుండగా ఏణ్ణర్థం గడిచింది. కవిత కొత్తగా ప్లంబింగ్ మెటీరియల్ షాపు పెట్టింది. 'మేడమ్! ఈ చుట్టుపక్కల అర కిలోమీటరు దూరంలో ప్లంబింగ్ షాపు లేదు. ఓ షాపు తెరిస్తే ఎలా వుంటుంది మేడమ్' అంది ఓ రోజు వచ్చి. నిజమే ఆ మాట - ఆ అమ్మాయి ముందాలోచనకి నిజంగానే ఆశ్చర్యం, సంతోషం కలిగింది.

'తప్పకుండా పెట్టు. మంచి ఆలోచన వచ్చిందే.. మరి డబ్బు...'

'బ్యాంక్ అప్పు ఇస్తుందిట గదా మేడమ్... మిమ్మల్ని ఆ వివరాలు అడగాలని వచ్చాను' అంది.

'బ్యాంకు లోన్ ఇస్తుంది. మరి ష్యూరిటీగా ఏదన్నా తనఖా పెట్టాలి, లేదంటే ఎవరన్నా ష్యూరిటీ వుండాలి. ఎంత లేదన్నా చిన్న షాపైనా ముప్పై నలభై వేలు లేనిది మెటీరియల్ రాదు గదా, షాపు అద్దె అది.. అంతా కలిసి ఓ యాభై వేలన్నా అవుతుంది మరి.'

' అవును మేడమ్, మా నాన్నని అడిగితే ఇల్లు తనఖా పెట్టి అప్పు తెచ్చుకుని నెలనెలా వాయిదాల మీద అప్పు చెల్లించేందుకు ఒప్పుకున్నారు. మాది

మూడు గదుల మిద్దె ఇల్లు. ఆ మాత్రం డబ్బు అప్పు ఇవ్వరా ఇంటిమీద. మేడమ్, ప్లీజ్! మీ బ్యాంకు వారికి చెప్పి లోన్ ఇప్పించగలరా' అంది ఆరాటంగా.

'ష్యూరిటీలు అవి వుండమంటే వుండలేను గానీ మాట సాయం చేయడానికేం. తప్పక చెపుతా. రేపు మీ ఇంటి కాయితాలు అవి తీసుకురా. వెళ్లి మాట్లాడుదాం' అన్నాను.

బ్యాంకు వాళ్లతో మాట్లాడటం, ఇల్లు తనఖామీద అప్పు ఇవ్వడానికి అంగీకరించి ఇల్లు ఎసెస్‌మెంట్ చేయించి, అప్లికేషన్ ఇవ్వడం, లోన్ శాంక్షన్ అవడం, కట్టవలసిన వాయిదాల అగ్రిమెంట్లు అన్నీ పూర్తయి డబ్బు చేతిలో పడేసరికి నెల పదిహేను రోజులయింది. తమ ఇంటికి ఆనుకొని రోడ్డు మీదకి వున్న చిన్న కిరాణా కొట్టు ఖాళీగా వుంటే పదివేలు కట్టి మిగతా పది వాయిదాల మీద ఇచ్చేట్టు వడ్డీ ఇచ్చేట్టు రాసి కొనేసింది. వాష్ బేసిన్, శానిటరీ ఫిట్టింగులు, కొళాయిలు, వాల్వులు, పైపులు, కావల్సిన సామానులు కొంది. చిన్న ఎత్తున ఆరంభించడానికి సరిపోయే మెటీరియల్ కొని, నా సలహా మీద ఆ బస్తీ ఎమ్మెల్యే చేత షాపు ఓపెన్ చేయించి చుట్టుపక్కల ఆపార్టుమెంట్లకి పాంప్లెటులు పంచింది. షాపులో కొంత సమయం తను, తనకి పని వున్నప్పుడు అన్నయ్య కూర్చుంటారు. తన చేతికింద ఓ హెల్పరుని పెట్టుకుంది. అన్న పని నేర్చుకోవడంతో బిల్డింగు మెయిన్‌టెనెన్స్ పనులకి హెల్పరుని ఇచ్చి పంపేది.

ఆరు నెలల్లో షాపు నిలదొక్కుకుంది. సామాను పెరిగింది. అమ్మకాలు పెరిగాయి. ఆదాయం పెరిగింది. లాభం వాయిదాల చెల్లింపుకి వెడుతూంది.

షాపులో కూర్చున్న కవిత మీద చాలా కళ్లు పడ్డాయి. కవిత మీద అనడం కంటే కవిత షాపు మీద అంటే బాగుంటుంది. చదువుకుంది. సంపాదించే పిల్ల మరి! అలా పడ్డ వాళ్లలో బి.కాం చదివి, కొన్ని కంప్యూటర్ కోర్సులు చదివి. ఉద్యోగాల వేటలో విజయం సాధించలేక బేవార్స్ గా తిరిగే సుధీర్ కవితకి వల వేశాడు. షాపు చుట్టూ తిరిగాడు. కవిత దృష్టిలో పడి, మాటలతో మొదలు పెట్టి, పరిచయం పెంచుకుని తన వాళ్లని కవిత ఇంటికి పంపి పిల్లనివ్వండి అని అడిగి మరీ పెళ్లికి అందరిచేత ఊఁఅనిపించేవరకు కవితని ఎన్ని రకాలుగా ఆకర్షించాలో అన్ని రకాలుగా ఆకర్షించి విజయం సాధించాడు. పాతికేళ్ల కూతురికి పెళ్లి చెయ్యాలి. చదువుకున్న కుర్రాడు, తండ్రికి గవర్నమెంటు నౌకరి, మిద్దె ఇల్లు, ఒక్కడే కొడుకు. ఇంతకంటే మంచి సంబంధం తమకి దొరకదు అనుకుని సుధీర్ చేత మూడు ముళ్లు వేయించేశారు. 'నీవొక్కర్తివి ఇంక ఇంత కష్టపడొద్దు. షాపు సంగతి

నాకొదిలెయ్. ప్లంబిగ్ పనులు నీవు చూసుకో, చూసుకో షాపు ఎలా మార్చేస్తానో' అని ప్రేమ ఒలకబోసి షాపులో సెటిల్ అయిపోయాడు. పక్కన్నున ఇంకో చిన్న షాపు బేరం చేసి కొనేసి మధ్య గోడ తీసి షాపు పెద్దది చేసి, కిటికీలు, గుమ్మాలు మార్చి, రంగులు వేయించి, క్యాష్ కౌంటర్ మార్పించి, దాని వెనకాల కూర్చున్నాడు. సామాన్లు పెరిగాయి. కంప్యూటర్ వుంటే స్టాకు వివరాలు, కొనడాలు, అమ్మకాల లెక్కలు సులువు అని ఓ సెకండ్ హ్యాండ్ కంప్యూటర్ కొని తన కంప్యూటర్ పరిజ్ఞానంతో లెక్కలేసి చూపి కవితని మురిపించాడు. పాపం కవిత పైపులు, వాల్వులు, నట్టులు బిగించుకుంటుంటే, సుధీర్ ఫ్యాను కింద కూర్చుని కంప్యూటర్ మీద చాటింగ్‌లు, బ్రౌజింగ్‌లు చేస్తూ, గేమ్స్ ఆడుకుంటూ కూర్చుంటాడు కస్టమర్లు లేనప్పుడు. ఆ అమ్మాయి షాపు ముందు నుంచి వెడుతుంటే ఎంతో ఎదిగిన ఆ అమ్మాయిని చూసి 'ముదితల్ నేర్వగ రాని విద్య కలదే' అనిపించి ఒక్క క్షణం గర్వంగా అనిపించినా, వెంటనే 'సొమ్మొకడిది, సోకొకడిది' అన్న నానుడి గుర్తురాక మానదు నాకు.

(పత్రిక – మే 2003)